# అంతరాలు

- చిట్టూరి కోటేశ్వరరావు I.P.S




"హల్లో...! మీ తాతయ్యకు ఫోనియ్యి!" అవతల వైపు సుబ్బరాజు.

"ఏం సుబ్బన్నా! ఏం చేస్తున్నావ్? మనవరాలితో ఆడుకుంటున్నవా? ఎంతసేపు ఆడతావు కానీ. బాంక్‌కు వెళ్లాలి. ఇంటికి రా!"

"అదేంటి బాబూ....! నిన్నేగా ఇరవై వేలు డ్రా చేశావు!"

"మన విన్నీ అమెరికా వెళ్తాడట. ఇంకో ముప్పై వేలు డ్రా చేయాలి."

"మై గాడ్! యాభై వేలే! కొంప కొల్లేరవుద్ది ఈ విధంగా అయితే .... విన్నీ కూడా అమెరికా వెళ్లిపోతే మనకు తోడెవరండీ బాబూ!" అంటూన్న సుబ్బరాజుతో

"ఈ కాలం పిల్లలు పెద్దల గురించి పట్టించుకోరయ్యా! వాళ్లది వాళ్లకే ముఖ్యం!"

అప్పుడే వచ్చిన వినీత్ ... "ఏంటి డాడీ, ఇరవై నాలుగ్గంటలూ ఫోన్! సుబ్బరాజు అంకులేగా! తర్వాత మాట్లాడుకోవచ్చు. సర్లేగానీ ... మా ఫ్రెండ్సంతా ఇప్పటికే అమెరికా వెళ్లిపోయారు. అయినా నాకు తెలియక అడుగుతాను. అమెరికా అంటే అంత అసహ్యం - నీకెందుకు?"

కొడుకు మాటలకు ఒక నిముషం ఖంగు తిన్నా తిరిగి మామూలు మనిషయ్యాడు రంగనాథం.

"మనకా అమెరికా చదువెందుకు? ఎవర్ని ఉద్ధరించడానికి? ఉన్నది మీ ఇద్దరికేగా. ఒకరికొకరు తోడుగా ఇక్కడే ఉంటూ స్థిరమైన ఉద్యోగాలు చేసుకుంటే జీవితం బాగుంటుంది కదా! ఇప్పటికే రెండేళ్లు వృథాగా గడిపావు. అన్నయ్యలాగా నువ్వూ సివిల్స్ రాసుకుని హాయిగా ఉండొచ్చు కదా!"

"డాడీ! నన్ను అన్నయ్యతో పోల్చవద్దని నీకెన్నోసార్లు చెప్పాను. ఏం సాధించాడని? అస్సాంలో ఐ.పి.ఎస్. ఎందుకూ కొరగానిది ... రోజూ ఆ బోడోలతో ప్రాణచెలగాటం. సంవత్సరానికొకసారి ఇంటికొస్తాడు. రెండ్రోజులుంటాడు. నా మార్గం వేరు. నేను కూడా నాలుగు యూనివర్సిటీలకు అప్లయ్ చేస్తాను. అందుకే యాభై వేలు అర్జెంటుగా చూడమన్నది... నాకవేం తెలియవు. నాకో గంటలో యాభై వేల చెక్, లేదా కాష్ కావాల్సిందే!" అన్నాడు వినీత్.

"సరే, అన్నయ్యకో మాట చెప్దాం!"

"ఇందులో అన్నయ్యకు చెప్పాల్సింది ఏముంది, డాడీ? ఆయన విషయాలు నాకెప్పుడైనా చెప్పావా? అలాంటప్పుడు నా సంగతి అతనికి చెప్పడమెందుకు? ఎవరి జీవితాలు వాళ్లవి. అతని జీవితం వేరు, నా జీవితం వేరు! స్థిరమైన ఉద్యోగం అంటే దానికర్థం ఏమిటి డాడీ?

"నెలకు పదివేల రూపాయల జీతం ... అదే స్థిరమైన ఉద్యోగం అనుకుంటే - ఆ బోడి ఉద్యోగం నాకవసరం లేదు. మా ఫ్రెండ్సందరూ అమెరికాలో 60 కె, 70 కె సంపాదిస్తున్నారు. అంటే ఎంతో తెలుసా డాడీ! 70 కె అంటే సంవత్సరానికి 70 వేల డాలర్లు! అంటే నెలకు ఆరు వేల డాలర్లు .... వాట్ మనీ డాడీ! యూ హోప్ టు బి హేపీ విత్ టెన్ థౌజండ్ బగ్స్ ఫర్ మంత్! నో, డాడ్! ఐ మస్ట్ లీవ్ ఇండియా!"

కొడుక్కి ఏం సమాధానం చెప్పాలో తెలియక బిత్తరపోయి చూస్తూండిపోయాడు రంగనాథం.

000

సరిగ్గా ముప్పై ఏడేళ్ల క్రితం ...

అప్పుడు.. తనకు ఇరవై రెండేళ్ల వయసులో ఎం.ఏ. పూర్తి చేసి భవిష్యత్ గురించి ఆలోచిస్తున్న రోజులు ...

మాయమాటలు చెప్పి అమ్మ దగ్గర ఓ ఐదు రూపాయలు సంపాదించి స్నేహితులతో కలిసి న్యూ రాయల్ కేఫ్‌లో బిరియానీ తిని శేష్‌మహల్‌లో మాట్నీ చూసి నాన్నగారికి కనబడకుండా దొడ్డిదారిన ఇంట్లోకి అడుగుపెట్టిన ఆ రోజులు ఒకటి తర్వాత ఒకటిగా - మస్తిష్కంలో జ్ఞాపకాల పొరలు పేజీల్లా తిరగడం మొదలెట్టాయి....

ఆ రోజుల్లో మిత్రులు జయదేవ్, సోమయాజులు ... తను విజయవాడలో ప్రకాశం బారేజ్ మీదుగా సైకిల్ తొక్కుకుంటూ సాయంత్రం నాలుగున్నరకల్లా బోడెమ్మ హోటల్ సెంటర్‌కు చేరుకుని ఓ టీ తాగి ఊళ్లో ఉన్న సినిమాల గురించి చర్చించుకుంటూ నాయుడు కోసం ఎదురు చూస్తూ ఉండేవాళ్లం.

మాలో అందరికన్నా సోమయాజులు చిన్నవాడు. అయినా అతడ్ని మేమంతా 'అన్నయ్య' అని పిలుస్తూండేవాళ్లం.

"తమ్ముడూ! నాయుడు కోసం ఇలా కాలాన్ని వృథా చేయడం ఏం బాగోలేదు. నాయుడు బీట్ డ్యూటీ మానేయలేదు. ఇక్కడ పడిగాపులు కాసేకంటే మనం కూడా అక్కడకే వెళ్లి డ్యూటీ చేస్తే 'ఎ.ఎన్.ఎమ్'నన్నా కొంచెంసేపు చూసి ఆనందించవచ్చు!" అన్నాడు సోమయాజులు.

"మనం బీట్లోకెళ్తే నాయుడు బాధపడిపోడూ...! ఓ రెండేళ్ల నుంచీ బీట్ డ్యూటీ చేస్తూనే ఉన్నాడు కదా, పాపం ఇంకా పరీక్షలో పాస్ కాలేదు. ఈ మధ్య ఎ.ఎన్.ఎమ్... పూర్ణానందంపేటలో వాళ్ల బావగారింట్లో మకాం పెట్టిందట. నాయుడు అక్కడ కూడా బీట్ డ్యూటీ చేసి వచ్చాడని తెలిసింది!" అన్నాడు జయదేవ్.

"ఇంతకూ ... ఈ విషయంలో జయదేవులవారి ప్రత్యేక శ్రద్ధ ఏమిటో?"

"ఒకవేళ ఎ.ఎన్.ఎమ్. నాయుడ్ని పెళ్లి చేసుకుంటానంటే నాయుడు ముందుకొస్తాడా? నిజంగా వాడికంత ధైర్యం ఉంటే నేనూ, రంగా ఆమెతో మాట్లాడుతాం!" అని నా తరపున కూడా వకాల్తా పుచ్చుకున్నాడు జయదేవ్.

"తమ్ముడూ! పాపం, నాయుడ్ని చూస్తుంటే జాలి ... బాధగా ఉంటుంది. కానీ వాడికి మాత్రం చీమ కుట్టినట్టయినా లేదు. వాళ్ల బావ సైకిల్ షాపులో డబ్బులు కొట్టేయడం .... సైకిలెక్కి కాళేశ్వర్రావు మార్కెట్‌కెళ్లడం ... అక్కడ కిళ్లీ కొట్లో సైకిల్ అప్పజెప్పడం ... నంబర్ టూ బస్సెక్కి మాచవరం కాలేజీ వరకు ఎ.ఎన్.ఎమ్.ను ఫాలో చేస్తూ వెళ్లడం ... మళ్లీ కాలేజీ అయిన తర్వాత తిరిగి డ్యూటీ మొదలు ... అంతే తప్ప ఒక్క రోజు కూడా ఎ.ఎన్.ఎమ్.తో మాట్లాడిన పాపాన పోలేదు. ఇదేదో మూగప్రేమలానే ఉంది. వన్ వే ట్రాఫిక్!" అన్నాడు సోమయాజులు.

"నాయుడికి గట్టి వార్నింగిచ్చి బీట్ డ్యూటీ మానిపిద్దాం!" అనే నిర్ణయానికొచ్చి కోకావారి వీధికి బయలుదేరాం ముగ్గురం.

సోమయాజులు నా వెనుక సీట్లో, జయదేవ్ అతని సైకిల్‌పై జెండా చెట్టు మలుపు తిరిగాం. పోలీసు మామ మమ్మల్ని ఠక్కున ఆపేశాడు.

"ఏమయ్యా ... చదువుకున్నవాళ్లు .... డబుల్స్ ఎక్కకూడదని తెలియదూ! మీ పేర్లు చెప్పండి!" అంటూ పాకెట్ బుక్ తీసి, రెండు కార్బన్లు పెట్టి, "పేరేమిటి?" అని అడిగాడు.

ఠక్కున 'ఎ.ఎన్.ఎమ్.!' అన్నాను.

"అంటే, మీరు ఉద్యోగం చేస్తున్నారా? ఏదో స్టూడెంట్స్ అనుకున్నాను. రైల్వే ఉద్యోగులు కాబట్టి ఈసారికి వదిలేస్తున్నాను. ఇంకెప్పుడూ ఇలా డబుల్స్ తొక్కుతూ కనిపించకండి!" అని వదిలేశాడు.

000

నాయుడు అరుగుమీద కూర్చుని తదేకంగా ఎ.ఎన్.ఎం. మేడవైపు చూస్తున్నాడు.

అప్పుడప్పుడూ బట్టలు ఆరేయడానికి, ఆరిన బట్టలు తీయడానికి ఆవిడ బయటకొస్తూండేది. ఆ దర్శనమే నాయుడికి మహద్భాగ్యం.

"ఎందుకు నాయుడూ ... ఈ వెధవ ఉద్యోగం! బావ సైకిల్ షాపు చూసుకుంటూ ఉంటే చాలదా? శేష్‌మహల్లో 'సూరజ్' రిలీజైంది. ఫస్ట్ షోకు వెళ్దాం, పద!" అని నాయుడ్ని బలవంతంగా డ్యూటీని విరమింపచేసి న్యూ రాయల్ హోటల్లో నాయుడు డబ్బుల్తోనే తలా రెండు సమోసాలు తిని, టీ తాగి తిరిగి డబుల్ రైడింగ్‌లో వెళ్తుంటే లోకం తెలిసేది కాదు!

000

"ఇంతకూ నీ సుపుత్రుడు ఏం చేస్తాడంట?"


"వాడికి లెక్చరర్ ఉద్యోగం చేయాలని ఉందట!" అన్నది రంగనాథం తల్లి.

"బతకలేక బడిపంతులు ఉద్యోగం అన్నట్టుంది ... వెధవ కోరికలు ... వెధవ బుద్ధులు! మద్రాస్ హయ్యర్ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లి ఐ.ఏ.ఎస్. కోసం ప్రిపేర్ కావచ్చుగా!" తండ్రి గొంతులో కోపం.

"అది కాదండీ ... వాడి మనసులో ఏముందో అది చేస్తే బాగుంటుంది కదా! అంతే కానీ ... మీరూ, నేనూ చెప్తే ఏం బావుంటుందండీ? ..."

ఆమె మాటలు ఇంకా పూర్తి కానేలేదు.

"నోర్ముయ్! వెధవ సలహాలూ, వెధవ ప్రసంగాలూ! వాడ్ని చిన్నప్పటి నుంచీ వెనకేసుకొచ్చి



ఆడపిల్లలా తయారుచేశావ్. ఎలా బతుకుతాడో ఏమో ... రోజూ డబ్బులిచ్చి సినిమాలకు పంపిస్తుండు. తల్లీ కొడుకులు అలాగే చేయండి. నీ జీవితం వంటింటికే పరిమితం. అలాగే నీ కొడుకుని కూడా ఓ బడుద్ధాయై బడిపంతులుగా తగలడమను! మద్రాస్ వెళ్తాడో, తగలడతాడో మీ ఇష్టం!" హుంకరించేవాడు నాన్న.

ఆయన మాటకు ఎదురు లేదు.

మళ్లీ రేపు శుక్రవారం లీలామహల్‌లో రిలీజయ్యే కొత్త సినిమా చూడడానికి డబ్బుల్ని ఎలా నొక్కాలా అనే ఆలోచనే తప్పితే మద్రాసు వెళ్లాలనే ఆలోచనే ఉండేది కాదు.

నాన్నగారు ఉద్యోగానికి వెళ్లడం ... మనమేమో మిత్రులతో కల్సి బెజవాడలో షికార్లు ... సినిమాలు ....

నాయుడుకూ, మా స్నేహ బృందానికీ 'ఫాదర్ ఫియర్' ఉండేది.

'గన్స్ ఆఫ్ నావరిన్' సినిమా చూసి హాయిగా బోడెమ్మ హోటల్లో టీ కొట్టి ట్రైనింగ్‌కు అనంతపురం ప్రయాణమవుతున్న నాయుడికి వీడ్కోలు చెప్పి ఇంటికొచ్చేసరికి ఎనిమిదయింది.

ఆ రాత్రి జరిగింది తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుంది.

నాన్నగారు ఉగ్రనరసింహావతారం ఎత్తారు.

రాత్రంతా ఇంట్లోకి ప్రవేశమ్మే లేదు. అంతా పాకలోనే ... పది రోజులు అలానే గడిచాయి. పదకొండవరోజు ఢిల్లీ ప్రయాణం ... తెలియని రాజ్యం ... ఆఖరికి అదే అందలమెక్కించింది.

ముప్పై అయిదేళ్ల జీవన ప్రవంతిలో అడపాదడపా ఒడిదుడుకులున్నా జీవితంలో హాయినే చవి చూపించింది. ఎంతో ఆనందంగా సాగిపోయిందనే చెప్పాలి!

నాన్నగారికి జీవితంలో ఎప్పుడూ ఎదురు చెప్పలేదు. ఇంట్లో అందరూ కలిసికట్టుగా ఉండేవారు. నాన్నగారిది ఒకే మాట .... దానికి తిరుగు లేదు.

ఆ రోజుల్లో అనుబంధాలు, ఆత్మీయతలు ఎంతో మధురంగా ఉండేవి. నాన్నగారు కోపంతో కేకలు వేస్తుంటే ... వంటగదిలో అమ్మ .... అది మరిచిపోవడానికి మైసూర్‌పాక్ పెడుతూండేది.

ఆ గడిచిపోయిన రోజులు మళ్లీ తిరిగి వస్తాయా?

నాన్నగారి క్రమశిక్షణ, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు చాలా కఠినంగా ఉండేవి. మా ఊరి మునసబుగారు ఇప్పటికీ చెబుతూనే ఉంటారు. అప్పటి విషయాలు .:.

అటువంటి క్రమశిక్షణలో పుట్టి పెరిగిన నేను అదే క్రమశిక్షణను నా ఇంట్లో ఈ రోజు అమలు పరచలేక తీవ్ర సంఘర్షణకు లోనవుతున్నాను.

000

అమెరికా చరిత్ర మనవాళ్లకు సరిగా అర్థంకావడంలేదు. అమెరికాకు హార్డ్‌వేర్ ఇచ్చింది నీగ్రోలు (నల్లజాతీయులు). సాఫ్ట్‌వేర్ ఇస్తున్నది ఇతర దేశాలవారు. అందులో మన భారతదేశం నుంచి ఎక్కువగా.. అమెరికా వలస వెళ్లి ఊడిగం చేస్తున్నారు.

డబ్బు సంపాదించాలన్న తపనే కానీ. ఎక్కడ, ఎలా అనేది విస్మరిస్తున్నారు. విదేశీ వ్యామోహం రోజురోజుకీ పెరిగిపోతోంది. మన దేశ పరిస్థితులు కూడా అలానే ఉన్నాయనుకోవచ్చు. అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశానికి ఇప్పటికి స్వరాజ్యం వచ్చి మూడు శతాబ్దాలు గడిచిపోయాయి. మనకు స్వాతంత్ర్యం వచ్చి అర్ధశతాబ్దమే కదా ...

మనది ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న దేశం. ఈ తరుణంలో మన ఆర్థిక పరిస్థితి, అమెరికాలోలా ఉండదు కదా ... అది అర్థం చేసుకోకుండా అందరూ అమెరికాను బాగు చేయాలని పరుగులు దీస్తుంటే మన దేశ పరిస్థితి ఏమిటి?

ఆ ఆలోచన మన యువతలో లేదు ...

మన దేశ సంస్కృతికి ప్రపంచ దేశాల్లో ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. అలాంటి సంస్కృతిని, మన యువత అమెరికాలోని వీధుల్లో అమ్మడానికి కూడా వెనుకాడడంలేదు. మన ప్రాచీన కళల వైభవాన్ని మన దేశస్థులు .. అమెరికాలో రెండు సాంస్కృతిక సంస్థలుగా విడిపోయి, వీధి భాగవతాలుగా ... ఎంతో గొప్పగా తయారు చేస్తున్నారు. అనేక వేలమంది ఇక్కడ నుంచి అమెరికాకు ప్రయాణం. అందులో రాజకీయ జోక్యం .... అంతఃకలహాలు ... పరస్పర విమర్శలు .... స్వర్ణాంధ్రదేశం ప్రాభవాన్ని వక్రీకరించి, ఎవరికి వారే కొత్త పంథాలో చెప్పాలనే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

000

రంగనాథం, భార్యతో "ఏమోయ్! నీ పుత్రుడికి యాభై వేలు కావాలట! బాంకుకెళ్లి తీసుకొస్తాను. టెలిఫోన్లు వస్తే నంబర్లు నోట్ చేస్తూ ఉండు!" అన్నాడు.

"యాభై వేలు ఎందుకట?" అన్నది శ్రీమతి.

"మన ప్రబుద్ధిడికి ఈ దేశంలో చదువు వంటపట్టడంలేదు. అమెరికా వెళ్లాలట. వెళ్లి ఏం చేస్తాడు? అక్కడేమైనా పర్మనెంట్ ఉద్యోగం దొరుకుతుందా? ఆ యాభై అయిదు రాష్ట్రాలు తిరగడం ... కాన్ఫరెన్స్ కాల్స్ ... పాత కార్లు కొనడం .... ఆదివారాలు షికార్లు .... వెధవ రొట్టెలు తిని బతకడం! అదేదో ఇంటిపట్టునే ఉండి సివిల్స్ రాసుకుని నాలా 35 ఏళ్లు స్థిరంగా గవర్నమెంట్ సర్వీసులో ఉండొచ్చు కదా! నువ్వయినా ఓసారి చెప్పి చూడు. వింటాడేమో!" అన్నాడు రంగనాథం.


"అయినా 35 ఏళ్లుగా మీరేం సాధించారేమిటి? ఎక్కడా ఓ సంవత్సరమూ వెలగబెట్టలేదు. వాడు అడిగినంత ఇవ్వండి. వాడైనా అమెరికాలో సుఖంగా ఉంటాడు!"

"సుఖంగా ఉంటాడన్నమాట!" రంగనాథం నిట్టూర్చాడు.

"సుఖంగా ఉంటాడో, ఉండడో మనకనవసరం. వాడు అడిగాడు, ఇవ్వండి! లేదంటే రాద్ధాంతం చేస్తాడు. మీకు బి.పి. పెరుగుతుంది. మళ్లీ హాస్పిటల్ చుట్టూ తిరగడం ... అంతేగా! అసలు తప్పంతా మీదేనండీ! వాడ్ని మీరే పూర్తిగా చెడగొట్టారు. మీ నాన్న మిమ్మల్ని ఎత్తుకోలేదని, బజార్లకు షికార్లు తిప్పలేదని, డబ్బులివ్వలేదని, మంచి బట్టలు కొనివ్వలేదని, గొప్ప గొప్ప స్కూలులో చదివించలేదని, ఎలాంటి ఆటలూ ఆడనివ్వలేదనీ మీరేమో మీ సుపుత్రుడికి మితిమీరిన స్వతంత్రం ఇవ్వడమే కాకుండా, వాడు అడిగింది చుక్కల్లో ఉన్నా సరే .... తెచ్చి ఇచ్చారాయె!

"చిన్నప్పటినుంచీ వాడు కట్టని బట్టల్లేవు, తిరగని ఊరు లేదు, చూడని ప్రదేశం లేదు. వాడి కోసం రాత్రంతా ఎదురు చూసి, వాడొచ్చాకే భోజనం చేసేవారు. వాడేమో ఇప్పుడు ఏకు మేకయ్యాడు. నేనంటే అసలు వాడికి గిట్టనే గిట్టదు. అసలు సుతరామూ భయం లేదు. మొన్నటికి మొన్న మోటార్ సైకిల్ యాక్సిడెంట్ చేశాడా ... చావాల్సింది ...! పోతే, పీడా విరగడై ఉండేది. వాడికన్నా ముందు మీరేడుస్తుంటిరి!?"

శ్రీమతి వైపు అసహనంగా చూశాడు



రంగనాథం.

"ఇప్పుడిలా చూసి మాత్రం ప్రయోజనం ఏమిటి? మీ ప్రతాపం అంతా నా మీదనే .... వాడికెలాగూ యాభైవేలు డ్రా చేయాలి కదా! ఆ చేత్తోనే నాకూ ఓ పది వేలు తెచ్చివ్వండి. నా పెద్ద కొడుకు దగ్గరకెళ్తాను!" సాగదీసుకుంటూ లోపలకు వెళ్లిపోయింది శ్రీమతి.

000

"ఒరే, విన్నీ! వీసాకు మద్రాసు ఎప్పుడ్రా వెళ్లేది?"

"ఓ డాడ్! నాలుగైదు రోజుల్లో వెళ్లాలి. నాకు స్టేషన్‌కు కారొస్తుందిగా. ఎకామడేషన్ ఏర్పాట్లు చేయడం మరచిపోవద్దు. నాతో పాటు నీహా కూడా మద్రాసు వస్తుందిగా. ఓసారి వాళ్లింటి కెళ్లొస్తాను!" అంటూనే వెళ్లిపోయాడు వినీత్.

ఖంగుతిన్నాడు రంగనాథం.

నీహా ఏమిటి? ఆ పాపతో మద్రాసు వెళ్లడమేమిటి? ఇద్దరూ కలిసి ఇలా విచిత్రంగా ప్రయాణం చేయడం ఏమిటి? ఈ స్నేహం వాళ్ల పెళ్లికి దారితీస్తుందేమో! అయినా విన్నీగాడు ఎంత ధైర్యంగా చెబుతున్నాడూ ... మా చిన్నతనంలో బాయ్‌ఫ్రెండ్‌ను కలవాలంటేనే ఇంట్లో పర్మిషన్ ఇచ్చేవారు కాదు. నాయుడు, జయదేవ్, సోమయాజులు తప్ప ఇంకెవరితో స్నేహం చేసినా ఒప్పుకునేవారు కాదు.

ఆ రోజుల్లో 'ఎ.ఎన్.ఎమ్.' గురించి ఎంత గుట్టుగా ఉండేవాళ్లమో ...

అయినా ఓ రోజు నాయుడు మంచి మూడ్లో మా అమ్మకు, చెల్లెలుకు చెప్పనే చెప్పాడు. నాన్న లేని సమయంలో టిఫిన్ తింటూ, "త్వరగా తినరా, ఎ.ఎన్.ఎమ్. దగ్గరకెళ్లాలి!" అన్నాడు. అంతే!

ఎ.ఎన్.ఎమ్. ఎవరు? కొత్త పరిచయమా? అని నిలదీస్తే, అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ అన్నాడు వాడు. కానీ ఎ.ఎన్.ఎమ్. శాంక్యో రెండురోజుల క్రితమే ఊరెళ్తూ ఓ వారం రోజుల వరకూ రానని అమ్మతో చెప్పి వెళ్లడంతో నాయుడు దొరికిపోయాడు.

సోమయాజులు అబద్ధం ఆడలేక నిజం చెప్పేశాడు.

నాయుడు ఓ అమ్మాయి వెంటపడుతున్నాడనీ ... అసలు పేరు సుధ ... కాలేజ్ బ్యూటీ! కోడ్ నేమ్ ఎ.ఎన్.ఎమ్. అంటే అత్తరు సాహెబ్ మరదలు. ఆ పేరెలా వచ్చిందంటే ఆమె బావ కాలేజీలో తెలుగు లెక్చరర్. ఆయన క్లాస్ కొస్తే చాలు రూమంతా అత్తరు వాసనలే! అందుకే కాలేజీ మొత్తం ఆయనకు అత్తరు సాహెబ్ అనీ, ఆయన మరదల్ని అత్తరు సాహెబ్ మరదలు ... ఎ.ఎన్.ఎం. అనీ పేరు పెట్టినట్లు ఆనందంగా చెప్పి అందరినీ నవ్వించాడు సోమయాజులు.

ఈ రోజుల్లో ఆడపిల్లలూ అలాగే ఉన్నారు. తారతమ్యాలు లేవు. అన్నిట్లో సమానం అంటున్నారు. ముందడుగు వేస్తున్నారు. ఇంకా నయం ... మగపిల్లలే సిగ్గుపడుతున్నారు.

ఈ మార్పు దేనికి దారితీయనున్నదో ... ఆలోచిస్తున్న రంగనాథం ఫోన్ మోగడంతో రిసీవర్ తీశాడు.

"హాయ్ డాడ్! రేపే మద్రాసు ప్రయాణం. నేను, నీహా వెళ్తున్నామన్న సంగతి నీకు తెలుసుగా! అర్జంటుగా మద్రాస్ ఫోన్ చేసి దొరై అంకుల్‌తో మాట్లాడి స్టేషన్‌కు కారు పంపమని చెప్పండి!" అని ఫోన్ పెట్టేశాడు వినీత్.

అప్పుడే వచ్చింది శ్రీమతి.

"ఏమోయ్! వారు రేపు మద్రాసు వెళ్లాలట. నీకు ట్రైన్ ఎల్లుండి. త్వరగా వచ్చేయ్!" అన్న రంగనాథం మాటలకు...

"ఏం స్వామీ! అంత త్వరగా రాకపోతే ఏంటట? నిదానంగా వస్తా! లేదా, ఓ నెలరోజులుంటా. మీకు నాతో ఏం పని? మీ చెత్త గాంగ్ ఉందిగా...!" అని ఇంకా ఇంకా ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా వాగ్బాణాలను గుచ్చుతుంటే ఆ బాధను భరించలేక, అలాగే ఉండి బాధపడలేక టీ.వీ. చూడటం మొదలెట్టాడు.

"ఇదొక మాయదారి టీవీ! ఆ ఎం.టి.వి. మీతోపాటు మీ కొడుకూ ఎంచక్కా చూసేవాడుగా. ఆ వి.టి.వి. ఎందుకు? ఆ ఆడముండలు పేలికల్లాంటి బట్టలతో ఎగరడం ... మీరు ఆనందించడమూ ... ఇక ఆపండి! నేను వార్తలు వినాలి! లేదా మీరూ, మీ కొడుకూ ఈ టీ.వీ.నే చూడండి. నాకు వేరే టీవీ కొనండి!"

"అబ్బ ... ఉండవే! టీవీ చూడనీయవు, పేకాట ఆడనీయవు ... ఎటూ పోనీయవు! నీతో అంతా చావే!"

"హాయిగా రిటైరయ్యారు. జియ్యర్ స్వామి ఊళ్లోనే ఉన్నారు కదా! ఆయనదీ మనూరు దగ్గర్లోనే కదా! ఆయన చెప్పింది వినొచ్చు కదా!"

"ఇంకా నయం ... ఏ బోధి వృక్షం కిందకో వెళ్లమనలేదు. ఇంకా ఎంతకాలం బతుకుతాంలే ... ఈ విన్నీగాడు అమెరికా వెళ్లి ఏం చేస్తాడో ఏమో ...!" రంగనాథం నిరాశగా అన్నాడు.

"వాడికేంటండీ మహారాజు! ఇతరుల మీద ఆధారపడాల్సిన అవసరం ఏముంది? అవసరమైతే ఫోన్ చేస్తాడు. మీరు ఎరేంజ్ చేస్తారు. ఇంతకూ అమెరికా వెళ్లిన వాళ్లంతా ఇంతేనంటారా?..."

"ఏముందే అమెరికాలో ... అక్కడకు వెళ్లిన ఆంధ్రుడెవడూ తిరిగి రాడు. ఆడపిల్ల అయితే అసలు తిరిగి రాదు. విన్నీగాడు కూడా ఎవరినో ఒకర్ని చేసుకుని అక్కడే సెటిలైపోతాడు. ఏం చేస్తాం ... నీ కేమైనా కోడలు మీద పెత్తనం చెలాయించాలని కోరికగా ఉంటే పెద్ద కొడుకును పెళ్లి చేసుకోమను!" రంగనాథం గొంతులో బాధ ధ్వనిస్తోంది.

"అమెరికా వెళ్లిన ఆడపిల్లలు ఎందుకు రారండీ ...?" అంటున్న శ్రీమతికి ఏమని అర్థం చెప్పాలో అర్థం కాలేదు రంగనాథానికి.

"ఇక్కడైతే అత్తమామలకు, అత్తింటివాళ్లకు సేవలు చేయాలి కదా! అదీగాక ఇక్కడ పురుషాహంకారం ఉంటుంది. ఇక్కడైతే భర్తకు నీలాగా ఏదో ఒకటి చేస్తూనే ఉండాలి కదా! అమెరికా వెళ్లిన తర్వాత ఆంధ్రులకు పురుషాహంకారం పోతుంది. పాపం, భార్య కోసం అన్ని సపర్యలూ, సేవలూ చేస్తాడు. వాడు ఆఫీసులోనూ బానిసే ... ఇంట్లోనూ బానిసే. ఏమైనా మనకు స్వాతంత్ర్యం అచ్చిరాదే ... విన్నీ కూడా రేపంతే... వాడు ఖచ్చితంగా నీహాను చేసుకుంటాడు. ఇంత వినయ విధేయతలున్న నీహా రేపు ఎలా మారుతుందో నేనూహించగలను!"

"నీహాతో పెళ్లవుతుందా ... వాళ్ల కులం .. మన కులం ..."

"ఇంకా కులమేమిటి ... అవి ఎప్పుడో పోయాయి..."

ఆ తర్వాత రంగనాథం మాట్లాడలేదు. దీర్ఘాలోచనలో పడ్డాడు.

000

విన్నీ చేతిలో యాభై వేలు పెట్టాడు రంగనాథం.

శ్రీమతి కూడా ఊరెళ్లాలనే విషయం అప్పుడే గుర్తొచ్చింది.

"నీ ప్రయాణం ఏమైంది?"

"నా ఏర్పాట్లు నేను చేసుకుంటున్నాలెండి ... మీకు కష్టంగా ఉందా! అలవాటు చేసుకోండి ... ఎంతకాలం ఒకరి మీద ఆధారపడటం..." అలా సాగి పోతూనే ఉంది శ్రీమతి నోటివెంట వాక్ప్రవాహం ...! ■




త్వరలో...

స్త్రీత 'స్కోప్'!

స్త్రీల వ్యాధులు- సమస్యల గురించిన సందేహాలకు
ప్రముఖ స్త్రీవైద్య నిపుణులు
డా. పి.ఉషారాణి, ఎం.బి.బి.ఎస్., డి.జి.ఓ., ఎం.డి.,
జవాబులు ఇవ్వనున్నారు

మీ సమస్యలను
పంపవలసిన చిరునామా ఇదే....
149, నీలగిరిబ్లాక్, ఆదిత్యా ఎన్‌క్లేవ్, హుడా మైత్రీవనమ్
పక్కన, అమీర్‌పేట. ఫోన్: 3747009
ఈమేల్: karumuri@satyam.net.in